క్లుప్తంగా

బాల్య వివాహంపై అవగాహన



బాల్య వివాహంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారవకోట: నౌతళ గ్రామంలో రెండ్రోజుల్లో జరగనున్న బాల్య వివాహంపై తల్లిదండ్రులకు అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహం జరగనున్నట్టు చైల్డ్‌లైన్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో ఐసీడీఎస్ సీడీపీవో హెచ్‌కే కామాక్షి, సూపర్‌వైజర్ సీతారత్నం, వీఆర్వో బాలకృష్ణ, హెచ్‌సీ సింహాచలం, చైల్డ్‌లైన్ ప్రతినిధి వైకుంఠరావు, సచివాలయ సిబ్బంది బాలిక తల్లిదండ్రులకు బాల్య వివాహం చేయడం వలన జరిగే అనర్థాలు, చట్టపరంగా తీసుకునే చర్యలను వివరించారు.

ఉపాధి వేతనదారు మృతిపై విచారణ



వేతనదారులతో మాట్లాడుతున్న అధికారులు

ఎల్.ఎన్.పేట: తురకపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం వేతనదారుడు సీపాన రాజారావు (60) ఇటీవల మృతి చెందారు. దీనిపై ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్, ఏపీవో వి.శ్రీదేవి విచారణ చేపట్టారు. శుక్రవారం గ్రామానికి చేరుకున్న అధికారులు గ్రామ పెద్దలు, ఉపాధి హామీ పథకం మేట్లు, వేతనదారులతో మాట్లాడి రాజారావు మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా పొందాల్సిన సహాయం కోసం అవసరమైన పత్రాలు సకాలంలో సమర్పించి సహకరించాలని కోరారు. వీరితో పాటు టెక్నికల్ అసిస్టెంట్ ఆర్.మన్మథరావు ఉన్నారు.

వెయ్యి కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం బస్తాల వద్ద విజిలెన్స్ సిబ్బంది

సరుబుజ్జిలి: గోనెపాడు గ్రామానికి చెందిన సింగుపురపు శ్రీనివాసరావు ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన వెయ్యి కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్‌చేసి 6–ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్సై రామారావు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక ఎంఎల్ఎస్ గొదాం అధికారులు అప్పగించామన్నారు. దాడుల్లో సీఎస్‌డీటీ డబ్బీరు రామకృష్ణ, వీఆర్వో రామరాజు పాల్గొన్నారు.


చేపల యూనిట్ పరిశీలన



చేపల యూనిట్‌ను పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు

పోలాకి: మత్స్యశాఖ ఆధ్వర్యంలో 60 శాతం రాయితీపై ఏర్పాటు చేస్తున్న లైవ్ ఫిష్ వెండింగ్ అండ్ సప్లై యూనిట్‌ను ఏడీ సంతోష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. చల్లబంద వద్ద రూ. 20 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్లో టన్ను లైవ్‌ఫిష్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవటంతోపాటు అక్కడే ఐస్‌ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఇది జిల్లాలోనే మొదటదన్నారు. దీంతోపాటు ప్రతి సచివాలయం పరిధిలోనూ ఫిష్‌ఆంధ్రా యూనిట్లు పెట్టుకునేందుకు ఆసక్తి గల యువకులకు రాయితీ అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే మత్స్యసాగుబడి కార్యక్రమంలో భాగంగా ప్రతివారం ఆక్వా రైతులకు, మైదాన ప్రాంత మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. పరిశీలనలో ఎఫ్ఏ గోవిందరావు, లబ్ధిదారులు ఉన్నారు.

కూలిన శిలాఫలకం



కూలిపోయిన శిలా ఫలకం

సరుబుజ్జిలి: గోనెపాడు గ్రామంలో మంచినీటి కోనేరు వద్ద ఏర్పాటు చేసిన ఉపాధిహామీ పనుల వివరాలకు సంబంధించిన శిలాఫలకం కూలిపోయింది. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువుకు 400 మీటర్ల విస్తీర్ణంలో సుమారు పది లక్షల రూపాయల ఉపాధి నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. పనులకు సంబంధించిన వివరాలు శిలాఫలకంపై నమోదు చేశారు.

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారుకు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయాలని ఆదేశించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వీవోఏలు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ సిబ్బంది అన్నదాతకు అందుబాటులో ఉండాలని కోరారు. అలాగే రైతులు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేయాలన్నారు. సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ విధిగా చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏ రకాల ధాన్యం కొనుగోలు చేస్తుందో అదే పండించాలని సూచించారు. వర్షాలు, నీటి సరఫరాను దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్ పనులకు సిద్ధం కావాలన్నారు. భూమి శిస్తు వసూళ్లపై రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సాగునీటి కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే చెప్పారు. రానున్న ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకొని తీసుకుంటున్న చర్యలను మండల వ్యవసాయాధికారి కె.సునీత వివరించారు. సమావేశంలో ఏడీ రవీంద్రభారతి, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, తహసీల్దార్ ఎ.సింహాచలం, వివిధ శాఖల అధికారులు, ఆర్‌బీకేల వీవోఏలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలి



నవధాన్యాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన అధికారులు ప్రకాష్, హేమసుందర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారా రాబోవుతరాలకు మెరుగైన ఆరోగ్యాన్ని ఇవ్వగలమన్నారు. పెద్దపద్మాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగును ప్రస్తుతం కొంతమంది రైతులు చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంతో చేకూరే లాభాలను వివరించారు. రైతులందరూ పూర్తిస్థాయిలో ప్రకృతి సేద్యానికి మారాలని..దీనికి సిబ్బంది సహకరిస్తారన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. గ్రామంలోని శతశాతం రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిచూపుతున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాలతిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ఉర్లాన హంసమ్మ, ఋషి, శ్రీధర్, సిబ్బంది మాధవి, పాపయ్య, లక్ష్మీకాంతం, జయలక్ష్మి ఉన్నారు.

గణితంపై చిన్నారులకు అవగాహన



కొత్తూరు: గణితంపై అవగాహన కల్పిస్తున్న శివకుమార్



నరసన్నపేట: కథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొత్తూరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా కొత్తూరులోని శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు గణితంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు పొందూరు శివకుమార్ లెక్కలను సులభంగా నేర్చుకునే విధానాన్ని వివరించారు. అర్థమయ్యేలా టీఎల్ఎం పద్ధతిలో బోధించారు. మెలకువలు తెలుసుకుంటే గణితం చాలా ఈజీ అన్నారు. విజ్ఞాన శిబిరాలకు పిల్లలను తల్లిదండ్రులు పంపించాలని సూచించారు. గ్రంథాలయ అధికారి ఎర్రమ్మ ఉన్నారు.

విద్యార్థులకు కథల పోటీలు

నరసన్నపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 14 మంది పాల్గొన్నారు. గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా పోటీలు నిర్వహించామని లైబ్రేరియన్ చాయ్ రతన్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సీహెచ్ రామారావు ఇన్విజిలేటర్‌గా వ్యవహరించారు.

భూసర్వే పరిశీలన



బూర్జ : లక్కుపురంలో డ్రోన్ సర్వేలో పాల్గొన్న సిబ్బంది, నాయకులు

ఎల్.ఎన్.పేట: రెవెన్యూ గ్రామాల వారీగా భూముల రీసర్వే చేయటం వలన ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య అన్నారు. జంబాడ, కొత్తపేట, సరడాం తదితర రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. రైతుల భూములకు సంబంధించిన పత్రాలు తీసుకువచ్చి చూపిస్తే ఆయా పంట పొలాలకు ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామ సచివాలయ సర్వేయర్లు తిరుమల, ఉమామహేశ్వరావు, మనోజ్, జయకృష్ణ, రామ్మోహనరావు, బాలకృష్ణ, రాములమ్మ పాల్గొన్నారు.

బూర్జ: తుడ్డలి, మద్రిపాడు, హరిపురం గ్రామాల్లో డ్రోన్‌తో భూసర్వే చేసే ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు సర్వేను పరిశీలించారు. శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం భూముల సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. భూయజమాని హక్కు పత్రాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర భూ సర్వే చేయడం జరుగుతుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే ఎంతగానో దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో సమగ్ర సర్వేటీమ్, వీఆర్వో రమణమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: సర్వే చేస్తున్న సిబ్బంది

నేడు పొందూరులో స్పీకర్ పర్యటన

పొందూరు: పొందూరు, గోకర్నపల్లి గ్రామాల్లో స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశంలో స్పీకర్ పాల్గొంటారు. అనంతరం గోకర్నపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని' నిర్వహించనున్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

ఎల్.ఎన్.పేట: వేసవి సెలవుల్లో ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. వేసవి శిక్షణ శిబిరాల పేరుతో విద్యార్థులకు తరగతులు నిర్వహించటం నేరమన్నారు. శిబిరాలు నిర్వహించాలనుకుంటే అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శిక్షణ శిబిరాల్లో కూడా యోగా, డ్రాయింగ్, క్రీడలు వంటి వాటిలో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సరుబుజ్జిలి: ఈ నెల 14న ఉదయం ఏడున్నర గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కరెంటు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు శుక్రవారం తెలిపారు. సరుబుజ్జిలి సబ్ స్టేషన్ పరిధిలోని యరగాం ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందున సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తులు ఆహ్వానం

మందస: ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు పరిధిలో సోంపేట, మందస మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో కె.వసుంధరాదేవి తెలియజేశారు. సోంపేట మండలంలోని మాకన్నపురం-1, జింకిభద్ర-1లలో అంగన్‌వాడీ వర్కర్లు, ఇసకలపాలేం-2, పలాసపురం-2లలో అంగన్‌వాడీ హెల్పర్లు, మందస మండలంలోని పిడిమందస, సింగుపురం, హరిపురం-4, నారాయణపురం గ్రామాల్లో హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను మందస పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీవో పురాణం నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కవిటి మండలం అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధించి బసవకొత్తూరు (ఓసీ–ఈడబ్ల్యూఎస్), బల్లిపుట్టుగ-1(ఓసీ), కంచిలి మండలం జెన్నాగాయి(ఎస్టీ) పోస్టులకు రోస్టర్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ సహాయకురాల పోస్టులకు సంబంధించి కంచిలి మండలం అర్జునాపురం(ఎస్సీ), జె.బైరిపురం(బీసీ–సీ), ఇచ్ఛాపురం మండలం మండపల్లి-1(ఓసీ), కవిటి మండలం ఇద్దివానిపాలెం-1(ఓసీ), ఆర్.కరాపాడు(ఎస్సీ), ఇచ్ఛాపురం అర్బన్ పరిధిలో కార్జివీధి(బీసీ–సీ) పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

ప్రజల్లో జవాబుదారీతనం పెంచాం

- శాసనసభ్యుడు కృష్ణదాస్
- రాణ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

జలుమూరు: ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు చేరువ చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందించి ప్రజల్లో జవాబుదారీతనం పెంచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. రాణ గ్రామంలో స్థానిక నాయకుడు దుంగ ప్రసాద్ ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును విరించారు. ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా మరింత మెరుగ్గా అందించి నీతి, నిజాయితీతో కూడిన పాలన అందిస్తున్నామని చెప్పారు. పేదల చదువుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వారికి కార్పొరేట్‌స్థాయి విద్య అందించి వారు ఉన్నత ఉద్యోగాల్లో స్థిర పడేందుకు చక్కని ప్రణాళికలు అమలు జరుగుతున్నాయన్నారు. పేదలకు పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. అమరావతిలో సైతం పేదలకు ఇళ్లు ఇస్తున్న పారదర్శక ప్రభుత్వం తమదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, మండల సలహాదారు పైడి విఠలరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు, దామ మన్మథరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



విద్యానగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ముఖ్యఉద్దేశమని స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2 పరిధి విద్యానగర్, సంపంగినగర్‌లో శుక్రవారం సాయంత్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ కష్టసుఖాలను తెలుసుకోవాలని తనను పంపించారన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధిని తెలియజేశారు. అలాగే నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. మనందరినీ అన్ని విధాలుగా ఆదుకుంటున్న ముఖ్యమంతి జగన్‌ను మీరంతా మనస్ఫూర్తిగా దీవించాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ వై.సూర్యం, నాయకులు బి.నారాయణమూర్తి, పసుకు మోహన్, రాము, వరదరాజులు, రామారావు, సచివాలయ ఉద్యోగులు, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలన్నీ ఏ గ్రేడ్‌లో ఉండాలి

- డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్‌రావు



సమావేశంలో గ్రామసమైఖ్య సభ్యులు, అధికారులు

పోలాకి: ప్రతి సచివాలయం పరిధిలోని మహిళా సంఘాలన్నీ ఏ–గ్రేడ్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్‌రావు సిబ్బందికి సూచించారు. చీడివలస సచివాలయం పరిధి జిల్లేడు మాకివలసలోని గ్రామసమైఖ్య సంఘ సమావేశానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. సభ్యులందరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలపై అవగాహన కల్పిస్తూ, వారికి ఆర్థికభరోసా కల్పించేలా రుణాలు ఇప్పించి తిరిగి సక్రమంగా చెల్లించేలా ఆర్థిక క్రమశిక్షణ అలవర్చుకునేలా తీర్చిదిద్దాలని చెప్పారు. సభ్యులందరికీ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డులు ఇప్పించి వేసవిలో వలసలు నిలువరించి తద్వారా వచ్చే వేతనంతో పొదుపుఖాతాలు కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఏపీఎం రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవామూర్తులు నర్సులు



కేక్ కట్‌చేస్తున్న డాక్టర్ మేఘన తదితరులు

కాశీబుగ్గ: నిరుపేద ప్రజలకు సేవామూర్తులుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్నటువంటి నర్సులు నిలుస్తున్నారని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ అన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా సీహెచ్‌సీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి నర్సులు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అగ్గున మేఘన, హెడ్ నర్సు ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న సాయిరాజ్

సోంపేట: మండలంలోని బారువ గ్రామంలో సాగునీటిని సరఫరా చేసే గ్రోయిన్ మరమ్మతులకు నిధులు కేటాయించాలని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బారువ గ్రోయిన్ పూర్తిస్థాయి మరమ్మతులకు సమయం లేనందున, ప్రస్తుతం తాత్కాలిక పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు సాయిరాజ్ తెలిపారు. అలాగే బహుదా నదిపై బైపాస్ రహదారి నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారని, వాటితో పాటు శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి రూ.20 కోట్ల నిధులు విడుదలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి




సమీక్ష నిర్వహిస్తున్న ఆర్జేజీ చిన్మయిదేవి

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీల సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్ (ఆర్‌జేడీ) జి.చిన్మయిదేవి సూచించారు. స్థానిక అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీల సీడీపీవో, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య పథకంపై అవగాహ కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ఫలితాలు అందేలా చూడాలన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



కవిటి: గంగా ఆహ్వాన జలయాత్రలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



కంచిలి: అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని కుసుంపురంలో ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిరంతరాయంగా నిర్వహించనున్న 72 గంటల హరేరామ హరేకృష్ణ(తారక నామ మంత్రం) యజ్ఞం నిర్వహణకు శుక్రవారం సాలసంస్కారం, గంగాజల ఆహ్వానం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన మహిళలతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గంగాజల ఆహ్వాన శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ జలాలతో యాగశాల సంప్రోక్షణ కార్యక్రమం పురోహితులు నిర్వహించనున్నారు. శనివారం నుంచి శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిరాటంకంగా జరుగుతాయని నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామంలో కొలువైన సింధుపురాణి అమ్మవారిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ దర్శించుకున్నారు. ఈ ఆలయం పునః ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఆమెతోపాటు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ జగబంధు దొళాయి, ఎంపీటీసీ సభ్యుడు బృందావన్‌సాహు తదితరులు ఉన్నారు.

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామంలో సంతోషిమాత ఉజ్జాపనలను మహిళలు సామూహికంగా శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని మహిళలంతా ఒకచోట చేరి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, స్థానిక నేతలు కప్పల యుగంధర్, బెల్లుపడ ఉపసర్పంచ్ దేశెట్టి దాలిబందు తదితరులు పాల్గొన్నారు.